ఈనాడు
అమరావతి
కృష్ణా



వాగ్దేవీ.. వందనం

మూలా నక్షత్రం పురస్కరించుకొని దుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆయన సతీమణి భువనేశ్వరి.. మంత్రి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ ఉన్నారు. బుధవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తన కుమార్తె ఆద్యతో కలిసి దుర్గమ్మ సేవలో పాల్గొన్నారు.



అఆఇఈ ఉఊ ఎఏఐ ఒఓఔ అంఅః కఖగఘ చఛజఝ టఠడఢణ తథదధన పఫబభమ యరలవ శషసహ ళక్షఱ

అక్షర రూపిణి.. అమృత వర్షిణి

సరస్వతీ దేవి దర్శనానికి తరలివచ్చిన జనసందోహం



అక్షరాభ్యాసం



తల్లీ వందనం



వీణాపాణీ.. చల్లగ చూడమ్మా..



విద్యాధరీ నమోస్తుతే



తరలివచ్చే భవానీలు



ఇంద్రకీలాద్రి ధగధగ





చదువులమ్మకు జేజేలు




ఇంద్రకీలాద్రి భక్తజన సంద్రమైంది. మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి రూపంలోని దుర్గమ్మను దర్శించుకునేందుకు.. లక్షల మంది భక్తులు తరలివచ్చారు. కొండ దిగువన రెండు కిలోమీటర్ల వరకూ క్యూలైన్లు, వాటి పక్కనున్న రహదారులు, ఘాట్‌రోడ్డు మొత్తం భక్తులతో కిక్కిరిశాయి. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా.. సీతమ్మవారి పాదాలు ప్రాంతంలో బారికేడ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదులన్నీ అర్ధరాత్రి నుంచే భక్తులతో నిండిపోయాయి. అక్కడి నుంచి రాత్రి 12.30 గంటల తర్వాత భక్తులను క్యూలైన్లలోకి వదిలారు. ఆపై బుధవారం అర్ధరాత్రి వరకూ క్యూలైన్లు రద్దీగానే నడిచాయి. వినాయక ఆలయం దగ్గర నుంచి పైవరకు రెండు కిలోమీటర్లకు పైగా భక్తులు రోజంతా కిక్కిరిసి క్యూలైన్లలో కనిపించారు. ఒక్క రోజులో రెండు లక్షల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సరస్వతీ దేవి రూపంలోని అమ్మ దర్శనానికి విద్యార్థులు, యువత అధికంగా తరలివచ్చారు. ఏడు రోజుల్లో ఇప్పటివరకూ ఆరున్నర లక్షల మందికి పైగా భక్తులు అమ్మను దర్శించుకున్నారు. ఏటా మాదిరిగానే.. ఈసారి కూడా భక్తులు మూలానక్షత్రం రోజు భారీగా పోటెత్తుతారని ముందే అంచనా వేసి పక్కాగా ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. వేకువన మాత్రం భక్తులంతా ఒకేసారి ఘాట్‌రోడ్డు మీదుగా ఆలయం వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు రద్దీ ఏర్పడింది. తర్వాత వారందరినీ క్యూలైన్లలోకి పంపడంతో ఆ తర్వాత నుంచి క్యూలైన్లు సాఫీగా సాగాయి.





దుర్గమ్మకు పట్టు వస్త్రాలు తెస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ......

జయము.. జయము.. దుర్గమ్మ



అంబరం తాకిన వాద్య సంరంభం

ఆలయ అభివృద్ధి పనుల చిత్ర ప్రదర్శన..

ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గమ్మను దర్శించుకుని.. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు బాగా చేశారని కొనియాడటంతో అధికారుల ఆనందానికి అవధులు లేవు. ఆలయంలో అభివృద్ధి పనుల చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత ముఖ్యమంత్రి కుటుంబానికి వేద పండితులు ఆశీర్వచనాన్ని అందజేశారు. తర్వాత సి. హెచ్. ఆంజనేయశాస్త్రి వేదాశీర్వచన మంత్రాల వివరణను తెలియజేయడంతో.. చంద్రబాబు, లోకేశ్ సహా కుటుంబ సభ్యులంతా ఆసక్తిగా విన్నారు. అమ్మవారికి రాజభోగం కింద నివేదించే.. ఐదు రకాల ప్రసాదాలను ముఖ్యమంత్రికి అందజేశారు. వీటిలో పులిహోర, పొంగలి, కట్టెపొంగలి, పాయసం, లడ్డూ ఉన్నాయి. ఈ రాజభోగాన్ని అమ్మవారికి ఎందుకు నివేదిస్తారనే అంశాన్ని ఆలయ అర్చకులు శంకర శాండిల్య వివరించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరి, కలెక్టర్ సృజన, విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు ఉన్నారు.



నేటి అలంకారం శ్రీ దుర్గాదేవి

శరన్నవరాత్రి మహోత్సవాల్లో గురువారం జగన్మాత.. శ్రీ దుర్గాదేవి రూపంలో దర్శనం ఇవ్వనుంది.

దర్శన వేళలు: ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు...

భక్తి పారవశ్యం



కమనీయం.. నగరోత్సవం

గంగాపార్వతీ సమేత దుర్గామల్లేశ్వర ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఈనాడు, డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక

మద్యం దుకాణాలకు 1,734 దరఖాస్తులు


మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిర్ణయం మేరకు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును రెండు రోజుల పాటు పొడిగించినట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) జి.గంగాధరరావు తెలిపారు. జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 123 దుకాణాలకు గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ముందస్తుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగియాల్సి ఉంది. దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచాలన్న విజ్ఞప్తుల మేరకు ఈ నెల 11వ తేదీ వరకూ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు ఈఎస్ చెప్పారు. రాష్ట్రంలోని ఏ దుకాణానికైనా దరఖాస్తు చేసుకోవడంతోపాటు ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో నమోదు చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. అన్ని ఎక్సైజ్ స్టేషన్లలో 11వ తేదీ వరకూ పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఇప్పటివరకూ 123 దుకాణాలకు 1,734 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లాలోని ప్రతి దుకాణానికి దరఖాస్తులు అందినట్టు తెలిపారు.



లాటరీ ప్రక్రియ వేదిక మార్పు

ముందస్తుగా ఇచ్చిన ఆదేశాల మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలోనే మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ నిర్వహించాల్సి ఉన్నా, నిర్వహణా పరమైన సౌలభ్యం కోసం స్థానిక నోబుల్ కళాశాలకు మార్చారు. తాజా ఆదేశాల ప్రకారం 14వ తేదీన నిర్వహించాల్సిన లాటరీ ప్రక్రియ వేదికను నోబుల్ కళాశాల నుంచి హిందూ కళాశాల(పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్, ఎంబీఏ బ్లాక్)కు మార్చినట్టు ఈఎస్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు వేదిక మార్పును గమనించడంతోపాటు ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా అధికారులు లేదా వారి పరిధిలోని ఎక్సైజ్ స్టేషన్లలో సంప్రదించవచ్చని సూచించారు.

గ్రామాల్లో ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి ప్రణాళికలు అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, వేదికపై జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో అరుణ

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: రాజ్యాంగ నిర్దేశిత పంచాయతీరాజ్ వ్యవస్థ పునరుద్ధరణ(రివైవల్)కు బాధ్యులైన ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. పీఆర్ వన్- విజిబుల్ ఎసెట్స్ అన్న అంశంపై జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యశాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పన్నుల వసూళ్లపై పూర్తి స్పష్టతతో ఉండాలన్నారు. గత ఆగస్టులో గ్రామసభల్లో రూపొందించుకున్న అభివృద్ధి ప్రణాళికలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయాలన్నారు. పంచాయతీలకు స్థానికంగా వచ్చే ఆదాయాల్లో ప్రధానమైన ఆస్తి పన్ను నిర్ధారణ, వసూళ్ల విషయంలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు. ఇంటి పన్నుల నిర్ధారణ ర్యాండమ్ చెక్ ఉంటుందన్నారు. మొండి పన్ను బకాయిదారులను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. పన్ను వసూళ్ల విషయంలో జరిమానాలు వేసేందుకు పురపాలక సంఘాల్లో అమల్లో ఉన్న ఆటోమేటిక్ వ్యవస్థను గ్రామాల్లోనూ అమలుకు ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. పంచాయతీల నిర్వహణ, జీతభత్యాలు తదితర వ్యయం పోను మిగిలిన నిధులతో విజిబుల్ ఎసెట్స్ ఉండేలా ప్రతిపాదించుకోవాలని ప్రభుత్వం సూచించినట్టు తెలిపారు. ఈనెల 14 నుంచి 21 వరకూ నిర్వహించే పల్లెపండగ వారోత్సవాలు విజయవంతం చేయాలన్నారు. పరిపాలనా ఆమోదం పొందిన ఉపాధిహామీ పనులకు భూమి పూజ, గ్రౌండింగ్‌లు చేయడమే పల్లెపండగ లక్ష్యమన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, స్వయంగా తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి 3 శాతం స్పోర్ట్ సెస్‌ను సంబంధిత శాఖకు చెల్లించాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారిణి జె. అరుణ పాల్గొన్నారు.

ఇసుమంత అనుమతి ఇసుకంతా ఎగుమతి

వైకాపా నాయకుల దందా | **కరిగిపోయిన నిల్వలు**

ఈనాడు, అమరావతి



భారీ వర్షాలు.. పొంగిన వాగులు వంకలు.. భారీ వరదల నేపథ్యంలో తవ్వకాల్లో జాప్యంతో ఉమ్మడి జిల్లాలో ఇసుక లభ్యత కష్టంగా మారింది. నిల్వ కేంద్రాల్లో ఇసుక కరిగిపోయింది. ఎన్టీఆర్ జిల్లాలో నామమాత్రంగా మాత్రమే నిలువ ఉంది. మరో పక్షం రోజుల వరకు ఇసుక లభించడం కొంత కష్టంగా మారింది. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది అక్రమంగా ఇసుక తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం పేదలందరికీ ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు 'ఉచిత ఇసుక' విధానం అమల్లోకి తెస్తే కొంత మంది చర్యల వల్ల అభాసుపాలవుతోంది. స్థానికంగా లభించని ఇసుక నిత్యం హైదరాబాద్‌కు మాత్రం తరలివెళ్తోంది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో తవ్వకాలపై నిఘా కొరవడింది. గనుల శాఖ అధికారులు ఇసుక రేవుల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు.

నిల్వ కేంద్రాల్లో ఏదీ..?

ఎన్టీఆర్ జిల్లాలోని కీసర, మాగల్లు, ఆమంచిపల్లి కేంద్రాల్లో మాత్రమే ఇసుక ఉంది. కొరత ఏర్పడిన ప్రారంభంలోనే కీసర నిల్వ కేంద్రం నుంచి దాదాపు లక్ష టన్నుల ఇసుక మాయం చేశారు. ఉచితంగా ఇసుక అందించాలని ప్రభుత్వం నామమాత్రంగా హ్యాండ్లింగ్ ఛార్జీలు వసూలు చేసిన విషయం తెలిసిందే. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వైకాపా నేతలు తమ లారీలను పెట్టి అధికంగా ఇసుక లోడ్ చేసి తక్కువ పరిమాణానికి మాత్రమే వసూలు చేసేలా నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జులతో కుమ్మక్కయ్యారు. ఒక్క కీసర నుంచే 45 టన్నుల ఇసుక లోడ్ చేసి 20 టన్నులకు మాత్రమే వసూలు చేసినట్లు రికార్డులు చూపారు. దీంతో నిల్వ కేంద్రంలో భారీ వ్యత్యాసం వచ్చింది. దీనిపై గనుల శాఖ అధికారులు విచారణ జరిపారు. ఇన్‌ఛార్జిని తొలగించారు. కానీ ఇసుక నిల్వలు మాత్రం కరిగిపోయాయి. దీనికి కారణం అక్కడ తూకం వేసే వేయింగ్ బ్రిడ్జి లేకపోవడమే. ప్రస్తుతం కీసర, మాగల్లు, ఆమంచిపల్లిలో 50వేల టన్నుల లోపు మాత్రమే ఇసుక నిల్వ ఉంది. దీన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నవారికి ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ నమోదైన వారికి రెండు మూడు రోజులకు కూడా సరఫరా కావడం లేదని చెబుతున్నారు. ఇసుక నిల్వలకు మించి నమోదు కావడంతో ప్రస్తుతం నిలిపివేశారు.

యథేచ్ఛగా రవాణా...

ఒకవైపు ఉమ్మడి జిల్లాలో ఇసుక కొరత ఉండగా.. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇసుక హైదరాబాద్‌కు యథేచ్ఛగా రవాణా అవుతోంది. వైకాపా ప్రభుత్వంలో పెద్దల నుంచి ఇసుక కాంట్రాక్టు పొందిన నందిగామ నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు ప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతూ హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం ఎస్ఈబీ రద్దుతో రవాణాకు ఆటంకం లేకుండా పోయింది. గతంలో ఓ వైకాపా నేత అనుచరుడిగా పెద్దల ఆశీస్సులతో కాంట్రాక్టు దక్కించుకున్నారు. పేరు జేపీ వెంచర్స్ మీద ఉన్నా ఆ నాయకులే తవ్వకాలు జరిపించారు. ఎన్నికల ముందు వైకాపా నేత తెదేపాలో చేరిపోయారు. ప్రస్తుతం కంచికచర్ల నాయకుడు మాత్రం గత సంబంధాలతో ఇసుక తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. తనకు సొంతంగా ఉన్న వాహనాలతో హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. విజయవాడలో ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్నవారికి మాత్రం ఇసుక లభ్యం కావడం లేదు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరవైందని వాపోతున్నారు.

రేవుల గుర్తింపు..!

ఎన్టీఆర్ జిల్లాలో రేవుల గుర్తింపు ప్రక్రియ దాదాపు పూర్తయింది. 15 రేవుల నుంచి ఈ నెల 16 తర్వాత తవ్వకాలు ప్రారంభిస్తామని గనుల శాఖ అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి వెంటనే ఉచితంగా ఇసుక అందిస్తారు. హ్యాండ్లింగ్, రవాణా ఛార్జీలు వసూలు చేయనున్నారు. కృష్ణా జిల్లాలో రేవుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించారు. గతంలోనూ కృష్ణా జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణా నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరిపారు. పర్యావరణ అనుమతులు సీఎఫ్ఈ, సీఎఫ్ఓలు లేకుండానే ఇష్టానుసారం తవ్వకాలు జరిపారు. దీనికి నాడు స్వయంగా జిల్లా కలెక్టర్ పి.రాజబాబు మద్దతు పలకడం గమనార్హం. ప్రస్తుతం రేవులు గుర్తించి పర్యావరణ అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా నదిలో చోడవరం, తోట్లవల్లూరు, రొయ్యూరు ప్రాంతాల్లో, పమిడిముక్కల మండలంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్ల నుంచి లారీలకు బదిలీ చేసి అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు అడ్డుకుంటే ఉచిత ఇసుక అంటూ సమాధానం ఇస్తున్నారు. జిల్లాలో మాత్రం ఇసుక లభ్యం కావడం లేదు. విజయవాడలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.6వేల నుంచి రూ.7వేల వరకు పలుకుతోందని భవన నిర్మాణదారులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం జీవం పోసుకుంటున్న తరుణంలో ఇసుక కొరతను నివారించాలని పలువరు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యార్థుల సామూహిక పూజలు

వీణాపాణీ నమోస్తుతే..



అలంకరణలో సరస్వతీదేవి

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: ఖ్యాతిగాంచిన వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు బుధవారం శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం సహస్రనామ కుంకుమార్చన, సరస్వతీ మూల మంత్ర హవనము, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ తొలి, మాజీ ఈవో అమ్మ ధర్మారావులు దంపతులు ఏడాది పాటు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం వడ్లమన్నాడు, గుడ్లవల్లేరు వారిచే భజన, సాయంత్రం ఊంజల్‌సేవ, పంచహారతులు నిర్వహించారు. విద్యార్థులచే సామూహిక సరస్వతీదేవి పూజ చేశారు. గురువారం ఆలయ పరిసరాల్లో జరిగే ఊరేగింపు, అన్నసమారాధన ఏర్పాట్లను సీఐ సోమేశ్వరరరావు, ఎస్ఐ సత్యనారాయణలు పరిశీలించారు.



సమ్మెటలతో స్లీపర్లను పగలగొడుతున్న కూలీలు



వ్యర్థాలను రహదారుల బాగుజేతకు వినియోగిస్తున్నారిలా..

వ్యర్థాలతో అదనపు ఆదాయం

రైల్వే పట్టాల కింద వేసే సిమెంట్ దిమ్మెలు కాలం చెల్లడంతో విజయవాడ-విశాఖ మార్గంలో ఇటీవల కాలంలో భారీగా తొలగించి, నూతనంగా వాటిని అమర్చారు. ఇలా తీసివేసిన వాటిని పుట్టగుంట సమీపంలోని (హనుమాన్‌జంక్షన్) రైల్వేస్టేషన్‌లోని ఖాళీ స్థలంలో నిల్వ ఉంచారు. వీటిలో ఉండే ఇనుము, సిమెంట్ వ్యర్థాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైల్వే శాఖ ఆదాయం సమకూర్చుకుంటూ ప్రైవేటు వ్యక్తులకు టెండర్ల ప్రక్రియ ద్వారా టోకున విక్రయించింది. సదరు వ్యాపారులు వీటిని దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశానికి తరలించి కూలీలతో సమ్మెటల ద్వారా స్లీపర్లను ధ్వంసం చేయిస్తున్నారు. సిమెంట్ వ్యర్థాలను ఖాళీ స్థలాలు, రహదార్ల బాగుజేతకు వీలుగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

రూ.8.8 కోట్ల పనులు చేసినా.. బిల్లు ఇవ్వలేదు

వైకాపా సర్కారు తీరుతో విసిగిన గుత్తేదారు ★ తనను తప్పించాలని కూటమి ప్రభుత్వానికి వినతి

మచిలీపట్నం రూరల్, న్యూస్‌టుడే

వైకాపా సర్కారు తీరుతో విసిగిపోయి కాంట్రాక్టును రద్దు చేయమని గుత్తేదారు ప్రభుత్వానికి లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండల పరిధిలోని చిన్నాపురం-కమ్మవారిచెరువు గ్రామాల మధ్య 12.96 కిలోమీటర్ల రహదారిని విస్తరించి, నిర్మించేందుకు వృద్ధి ఇన్‌ఫ్రాటెక్-రిత్విక్ సంస్థ టెండరు పొందింది. రహదారి నిర్మాణానికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.58.33 కోట్లు మంజూరు కాగా, 2021 ఫిబ్రవరిలో గుత్తేదారు పనులు మొదలుపెట్టారు. చిన్నాపురం-తుమ్మలపాలెం, తుమ్మలపాలెం- వాడగొయ్యి మధ్య రహదారిని విస్తరించారు. సత్యనారాయణపురం వద్ద పంటకాలువపై 270 మీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మించారు. కొన్ని చోట్ల కల్వర్టులు నిర్మించారు. 15 శాతం మేర రూ.8.8 కోట్ల విలువైన పనులు పూర్తి చేసి బిల్లులు పెట్టగా వైకాపా సర్కారు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. దీంతో నిర్మాణ సంస్థ 2022లోనే పనులు నిలిపివేసింది. తాజాగా గుత్తేదారు కూటమి ప్రభుత్వానికి తనను కాంట్రాక్ట్ నుంచి తప్పించాల్సిందిగా లిఖితపూర్వకంగా వేడుకున్నారు. సమాచారం మంత్రి కొల్లు రవీంద్రకు తెలియడంతో గుత్తేదారుతో మాట్లాడారు. బిల్లులు చెల్లిస్తామని, రోడ్డు నిర్మాణాన్ని కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం ఎంతో కొంత మొత్తం చెల్లిస్తే కాని పనులు ప్రారంభించలేనని గుత్తేదారు నిస్సహాయత వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో ప్రభుత్వం బిల్లులు చెల్లించే అవకాశం ఉందని, రహదారి నిర్మాణం తిరిగి ప్రారంభం అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చిన్నాపురం-తుమ్మలపాలెం మధ్య విస్తరించిన రహదారి



సత్యనారాయణపురం-వాడపాలెం మధ్య సింగిల్ లైన్ రోడ్డు

పోలీస్ కార్యాలయ పరిపాలనాధికారుల బదిలీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పోలీస్ కార్యాలయాలు, పోలీస్ కమిషనర్ కార్యాలయాల పరిపాలనాధికారులను (ఏవో) బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయ ఏవో టి.రంగారావును మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కార్యాలయానికి బదిలీ చేశారు. కృష్ణాజిల్లా ఎస్పీ కార్యాలయంలో పని చేస్తున్న ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తిని కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయానికి పంపారు.

తక్కువ ధరలకే నూనె, టమాటా: జేసీ

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: ధరల నియంత్రణలో భాగంగా వంటనూనెలు, టమాటాలను తక్కువ ధరలకే అందజేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్‌ఫ్లవర్ నూనె లీటరు పాకెట్ రూ.124 చొప్పున, పామాయిల్ లీటరు పాకెట్ రూ.114 చొప్పున, టమాటా కేజీ రూ.50 చొప్పున బుధవారం నుంచి రైతుబజార్లలో అందజేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు కందిపప్పు, బియ్యం, వంటనూనెలు, టమాటాలను నిర్దేశించిన తక్కువ ధరలకు కొనుగోలు చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట రుణాల రీషెడ్యూల్‌కు అవకాశం

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: భారీ వర్షాలు, వరదలతో పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో రైతులు తీసుకున్న పంట రుణాలను రెండు సంవత్సరాలకు రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినట్టు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర పంట రుణాలకు మారటోరియం(తాత్కాలిక నిషేధం)తో కలుపుకుని రెండు సంవత్సరాల వరకూ అదనంగా ఎటువంటి జరిమానా, వడ్డీలు లేకుండా పొడిగించుకునే వెసులుబాటు ఉందన్నారు. తీసుకున్న పంట రుణం చెల్లించాల్సిన గడువు ముగియని వారికే ఈ ప్రయోజనం వర్తిస్తుందన్నారు. రైతులను ఎటువంటి ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం కల్పించిన రీషెడ్యూల్ అవకాశాన్ని సరళతరంగా అమలు చేయాలని బ్యాంకర్లను కోరారు.

ఎట్టకేలకు వంతెన టెండరుకు స్పందన



ఏటిమొగ, ఎదురుమొండి మధ్య నడుస్తున్న పంటు

అవనిగడ్డ : ఎదురుమొండి ఏటిమొగ, ఎదురుమొండి దీవుల మధ్య కృష్ణా నదిపై వంతెన(వారధి) నిర్మాణానికి గత నెల 11వ తేదీ ఆర్అండ్‌బీ అధికారులు పిలిచిన టెండరుకు ఎట్టకేలకు స్పందన వచ్చింది. ఇద్దరు గుత్తేదారులు టెండర్లు వేశారు. రూ.109 కోట్ల అంచనా వ్యయంతో వంతెన నిర్మాణానికి పిలిచిన టెండరు గడువు గత నెల 25వ తేదీతో ముగిసింది. గత ప్రభుత్వ హయాంలో మూడు సార్లు టెండర్లు పిలిచినప్పటికీ గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పిలిచిన టెండరుకు స్పందన వచ్చింది. ఆర్అండ్‌బీ పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణ మాట్లాడుతూ టెండర్లతో పాటు పలు అంశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రెండింటిలో ఒక టెండరు ఖరారు చేస్తామన్నారు.


విద్యుదాఘాతానికి గురై కూలీ మృతి



పోతురాజు మృతదేహం

కోడూరు (అవనిగడ్డ): మండల పరిధిలోని జరుగువానిపాలెంకు చెందిన కూలీ అప్పికట్ల పోతురాజు (48) విద్యుదాఘాతానికి గురై బుధవారం మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. చింతకోళ్ల గ్రామంలో రొయ్యల చెరువు గట్టుపైన పచ్చగడ్డి కోస్తున్న క్రమంలో పచ్చగడ్డితో పాటు విద్యుత్తు తీగను కూడా కోయడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.చాణక్య తెలిపారు. అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ అనంతరం అతడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తప్పిన ప్రమాదం



పెచ్చులూడిన బంటుమిల్లి మండల పరిషత్తు కార్యాలయ పైకప్పు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: బంటుమిల్లి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో పెను ప్రమాదం తప్పింది. బుధవారం పైకప్పు పెచ్చులూడి నేరుగా ఈవోపీఆర్డీ కుర్చీలో పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఆమె లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. అదే గదిలో కంప్యూటర్ ఆపరేటర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు. వారికి ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కార్యాలయానికి సకాలంలో మరమ్మతులు చేయించకపోవడంతో చాలా చోట్ల పైకప్పు దెబ్బతింది. వర్షాకాలంలో నీరు కారుతోంది. సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.



ఈవోపీఆర్డీ కుర్చీలో పడిన పెచ్చులు

ఏపీలో తెలంగాణ అధికారుల బృందం పర్యటన

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



బృందంతో సమావేశమైన ఏపీ రైతు సాధికార సంస్థ ప్రతినిధులు

ఆత్కూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం ఏపీలో పర్యటించింది. ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) నమూనాలను పరిశీలించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి జి.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా.బి.గోపి, డిప్యూటీ డైరెక్టర్ కె.శివప్రసాద్, డైరెక్టర్ డా.బి.జమునారాణి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ (ఆగ్రోనమి) డా.ఏవీ.రామాంజనేయులుతో పాటు సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన ఇద్దరు మండల వ్యవసాయాధికారులు, రైతులు బుధవారం విజయవాడ చేరుకున్నారు. తొలుత ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో ఏపీసీఎన్ఎఫ్ ప్రాముఖ్యతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్‌కుమార్ వివరించారు. ప్రభుత్వ, దాతృత్వ సంస్థల నుంచి అందిన నిధుల మద్దతుతో 10 లక్షల మందికి ప్రకృతి వ్యవసాయం చేరుకున్న ప్రయాణాన్ని విపులంగా విశదీకరించారు. 1.5, 2 ఎకరాల భూమి గల రైతు కుటుంబాలకు నెలకు రూ.25 వేల నికర ఆదాయమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో రైతుల సుస్థిర పద్ధతులను స్వీకరించడంలో చూపిన ధైర్యం, ఆవిష్కరణలను రైతు సాధికర సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డా.డీవీ రాయుడు ప్రశంసించారు. పలువురు రైతులు తమ అభిప్రాయాలను సమావేశంలో పంచుకున్నారు. అనంతరం గుంటూరు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు బృంద సభ్యులు తరలివెళ్లారు.

జ్యోత్స్నకు ఘన నివాళి



జ్యోత్స్న పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న జస్టిస్ ఎ.వి.శేషసాయి తదితరులు

విజయవాడ నేరవార్తలు, సీతారాంపురం, న్యూస్‌టుడే : ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, ఆలిండియా లాయర్స్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి, సామాజిక కార్యకర్త గుళ్లపల్లి జ్యోత్స్న(55)కు న్యాయమూర్తులు, బార్ కౌన్సెల్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. జ్యోత్స్న పార్థివదేహాన్ని బుధవారం ఉదయం విమానంలో నగరానికి తీసుకువచ్చారు. సీతారాంపురంలోని స్వగృహం వద్ద ప్రజలు, బంధుమిత్రులు సందర్శనార్థం ఉంచారు. ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి, ఏపీ బార్ కౌన్సెల్ ఛైర్మన్ ద్వారకానాథరెడ్డి, బార్ కౌన్సెల్ పూర్వ ఛైర్మన్ గంటా రామారావుతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి బార్ కౌన్సెల్ సభ్యులు సుదర్శనరావు, ముప్పాళ్ల సుబ్బారావు, ఎస్.మల్లేశ్వరరావు, కృష్ణారెడ్డి న్యాయవాదులు తరలివచ్చి ఆమె పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. సుంకర రాజేంద్రప్రసాద్‌ను, ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామమోహనరావు, ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ ఉపాధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, ఏపీ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.చిదంబరం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ అధ్యక్షుడు, బార్ కౌన్సెల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది ఎ.బి.రాజేంద్రప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల లీగల్ సెల్ న్యాయవాదులు జ్యోత్స్నకు ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పూర్వ కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సి.హెచ్.బాబూరావు, బి.తులసీదాస్, మంతెన సీతారామ్, డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ తదితరులు అంజలి ఘటించారు.

సౌర విద్యుత్తుకు పెద్దపీట

హనుమాన్‌జంక్షన్, : జిల్లా వ్యాప్తంగా ఉన్న గృహ వినియోగదార్లు సౌర విద్యుత్తు వ్యవస్థను అమర్చుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సీపీడీసీఎల్ కృష్ణా జిల్లా ఎస్ఈ ఎం.సత్యానందం సూచించారు. పీఎం సూర్య ఘర్ పేరుతో దీనికి రాయితీ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హనుమాన్‌జంక్షన్ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, బుధవారం అధికార్లతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇంటి పైకప్పు మీద సౌర విద్యుత్తు ఫలకాలు అమర్చుకునే ప్లాంట్ సామర్థ్యంను బట్టి రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు రాయితీ లభిస్తుందన్నారు. మండలానికో నమూనా సౌర విద్యుత్తు గ్రామం ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు సత్వరమే మంజూరు చేస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న నెల లోపుగానే సర్వీసు ఇస్తున్నామన్నారు. ఆర్డీఎస్ఎస్ పేరుతో గ్రామాల్లో విద్యుత్తు సరఫరా మెరుగుపర్చే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ఈఈ(ఆపరేషన్స్) బీవీ సుధాకర్, ఏడీఈ నారాయణ, గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాస్, హనుమాన్‌జంక్షన్ డీఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహన చోరీల నిందితుడి అరెస్టు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసుల పనితీరు బాగుందని ఏదేని ఘటన జరిగిన వెంటనే వారు స్పందించే విధానం అభినందనీయమని జిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. బుధవారం కంకిపాడు పోలీసుస్టేషను వద్ద మోటారు సైకిలు చోరీలో అనుమానితుని చాకచక్యంతో పట్టుకుని విచారించగా అతని వద్ద 8 మండలాలకు చెందిన 38 వాహనాలు లభ్యమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎస్పీ గంగాధరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనే ఇప్పటి వరకూ చేయని విధంగా కంకిపాడు పోలీసులు చోరీ వాహనాలను రికవరీ చేశారన్నారు. నిందితుడు పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామానికి చెందిన అప్పికట్ల రాజీవ్‌గా గుర్తించామన్నారు. అతను స్థానికంగా ఓ బడ్డీ కొట్టు నిర్వహిస్తాడని, చెడు వ్యసనాలకు బానిసై పలు నకిలీ తాళాలను వెంట తీసుకుని గ్రామాల్లో సంచరిస్తూ నిర్మానుష్య ప్రాంతాల్లోని వాహనాలను చోరీ చేయడం అలవాటుగా చేసుకున్నాడన్నారు. జిల్లాలోని కంకిపాడు, చల్లపల్లి, గన్నవరం, గుడివాడ రూరల్, తోట్లవల్లూరు, ఉయ్యూరు టౌన్, ఉయ్యూరు రూరల్ తదితర పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలు చేశాడన్నారు. నిందితుడు పునాదిపాడు వద్ద వాహన తనిఖీ చేసే సమయంలో పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించడంతో అతడిని పట్టుకోగా, అసలు విషయం తెలిసిందని పేర్కొన్నారు. రికవరీ చేసిన వాహనాల విలువ సుమారు రూ.20.4 లక్షల విలువ ఉంటుందన్నారు. వాహనాలను రికవరీ చేసిన సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్, హెడ్‌కానిస్టేబుళ్లు చంద్రబాబు, మూర్తి, కానిస్టేబుల్ బాజి, వీరాంజనేయులు, దిలీప్‌కుమార్, సిబ్బంది పిళ్లై, మురారీలకు రివార్డులు ఎస్పీ అందజేశారు. అనంతరం నిందితుడిని విజయవాడ కోర్టుకు తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

పార్వతీదేవికి వెండి కవచం బహూకరణ


వెండి కవచంతో ఆలయానికి వచ్చిన దాతలు

పెడన, న్యూస్‌టుడే: స్థానిక గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవికి పెడనకు చెందిన ఒక కుటుంబం వెండి కవచాన్ని బహూకరించింది. స్థానిక 17వ వార్డు పోలవరపుపేటకు చెందిన దివంగత మెట్ల మహేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన భార్య కమలకుమారి, కుమారుడు కనక వెంకట సుబ్రహ్మణ్య సురేష్, వసంత దంపతులు బుధవారం ఈకవచాన్ని ఆలయంలో అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బళ్ల ప్రసాద్ పలువురు ప్రముఖులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పూజారి గూడూరి అగస్త్యయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాన్ని అమ్మవారికి అలంకరించారు.

చోరీ సొత్తు స్వాధీనం

బంటుమిల్లి: చోరీకి పాల్పడి పరారవుతున్న ఒక బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని సొత్తు రికవరీ చేశారు. ముంజులూరులోని పామర్తి పాపారావు ఇంటిలో ప్రవేశించిన బాలుడు సుమారు 5 కాసుల బంగారు ఆభరణాలను చోరీ చేసి పరారవుతుండగా.. అటువైపు వెళుతున్న ఎస్సై గణేష్‌కుమార్ అతని కదలికను గుర్తించి ప్రశ్నించారు. దీంతో చోరీ ఘటన వెలుగు చూసింది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాలుడిది ఏలూరు జిల్లా అని పోలీసులు చెప్పారు.

విజయంపై భాజపా నాయకుల హర్షం

భాస్కరపురం(మచిలీపట్నం): హరియాణాలో భాజపా మూడోసారి అధికారంలోకి రావడం, కశ్మీర్‌లో రెండో స్థానంలో నిలవడంపై భాజపా నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భాజపా నాయకులు పాల్గొన్నారు.

గూడూరు ఆసుపత్రిలో నారాయణసేవ

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు సామాజిక ఆసుపత్రిలో సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నారాయణసేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వారందరికీ సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో భోజనాలు అందజేశారు. వైద్యులు అరుణకాత్యాయిని, వి.నరేంద్ర, హరిరంగ ప్రసాద్‌లు గర్భిణులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు నిర్దేశించిన సమయాల్లో ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సత్యసాయిసేవాసమితి ప్రతినిధులు పోతుకూచి ఆంజనేయకుమార్, కొట్టి నాగమణి, జ్యోతి, కృష్ణకుమారి, నాగమణి, వరప్రసాదు తదితరులు నారాయణసేవలో పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న సత్యసాయిసేవాసమితి ప్రతినిధులు

నిబద్ధత కలిగిన నేత గోఖలే


గోఖలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గద్దె అనురాధ, జడ్పీటీసీ మాజీ సభ్యులు, నాయకులు

గూడూరు, న్యూస్‌టుడే: గోఖలే నేటితరం నాయకులకు ఆదర్శమని జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. చిట్టిగూడూరు గ్రామానికి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యులు చిలుకోటి గోపాలకృష్ణగోఖలే ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం ఆమె పలువురు మాజీ జడ్పీటీసీ సభ్యులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా అనురాధ మాట్లాడుతూ తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం పనిచేసి నిబద్ధత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. సమాజ అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేశారని, దాదాపు 300కుపైగా కులాంతర వివాహాలు చేసి గొప్ప సంఘ సంస్కర్తగా పేరుతెచ్చుకున్నారంటూ కొనియాడారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యునిగా, విజయవాడ కనకదుర్గ ఆలయ బోర్డు సభ్యునిగా పని చేశారన్నారు. తాను జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలోనే ఆయన జడ్పీటీసీ సభ్యునిగా ఉన్నారని ప్రజల సమస్యలపై నిరంతరం తనవద్దకు వచ్చి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరనిలోటన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు లంకే నారాయణప్రసాదు, కొల్లూరి వెంకటేశ్వరరావు, పైడిపాముల కృష్ణకుమారి, దాసరి కరుణజ్యోతి, వాసిరెడ్డి రామకృష్ణప్రసాద్, దిరిశాల వెంకట కృష్ణారావు, ఒడుగు తులసీరావు, కె.వెంకటేశ్వరరావులతోపాటు మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, నాయకులు గోఖలే చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ప్రజల సహకారంతో స్వచ్ఛ నగరం సాకారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.సి ఆనందకుమార్ అన్నారు. స్వచ్ఛ మచిలీపట్నం సాధనలో భాగంగా చెత్త నిర్వహణ సక్రమంగా జరిగేలా జిల్లా కలెక్టర్ పది డివిజన్‌లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. దీనిలో భాగంగా ఆనంద్‌కుమార్‌కు 1 నుంచి 10 డివిజన్లు కేటాయించగా బుధవారం ఆయన పారిశుద్ధ్య సిబ్బందితో పలు ఇళ్లకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా సిబ్బందికి అందించాలని సూచించారు. అందరూ సహకరిస్తే స్వచ్ఛ నగరం సాకారం అవుతుందన్నారు.

అక్కడ ఇళ్లెలా నిర్మించుకోవడం!

జగనన్న కాలనీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

కూటమి ప్రభుత్వ హయాంలో సొంతింటి కల నెరవేరుతుందని ఆశ

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: బందరు మండలంలోని చిట్టిపాలెంలో ఊరికి దూరంగా పొలాల మధ్యలో ఇళ్లస్థలాలు కేటాయించారు. ఇక్కడ స్థలాలు కేటాయించడాన్ని ముందు నుంచీ గ్రామస్థులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. అయినా వైకాపా పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పైగా అధికారులతో ఒత్తిడి పెట్టడంతో కొందరు ఇళ్ల నిర్మించుకున్నా అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం దానిని చూస్తే ఇది కాలనీయేనా అన్న అనుమానం కలుగుతోంది. పొలాల మధ్యలో ఉన్న డొంక వెంట నడుచుకుంటూ వెళితే అసంపూర్తిగా వదిలేసిన ఇళ్ల నిర్మాణాలను ఆవరించిన పొదలతో అస్తవ్యస్తంగా కనిపిస్తుంది. ఇదొక్కటే కాదు బందరు, పెడన నియోజకవర్గాల్లోని అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. పునాదుల దశలో కొన్ని చోట్ల... అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లు ఇంకొన్ని చోట్ల ఇలా ఎక్కడ చూసినా జగనన్న కాలనీలు అధ్వానంగా మారి వైకాపా పాలకుల తీరును వేలెత్తి చూపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదేశాలతో ఆ కాలనీల్లో ఎంతమంది ఇళ్లు నిర్మించుకున్నారు.. ఇంకా ఎలాంటి వసతులు కల్పించాలి తదితరాలపై అధికారులు ఆరా తీస్తుంటే లబ్ధిదారులు అక్కడ సమస్యలపై మొరపెట్టుకుంటున్నారు.

అసంపూర్తిగా...

వివిధ గ్రామాల్లో లేఔట్లు చూస్తే అన్ని చోట్లా అంతే అన్నట్లుగా తయారయ్యింది పరిస్థితి. గూడూరు మండలంలో రాయవరం, పోలవరం, మల్లవోలు, ఆకులమన్నాడు, కంకటావ, గురిజేపల్లి, తరకటూరు ఇలా వివిధ గ్రామాల్లో 39 లేఔట్లు వేసి 1,500 మందికి పైగా స్థలాలు కేటాయించారు. కానీ ఎక్కడా పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. రాయవరం గ్రామంలోని లేఔట్‌లో ఒకరిద్దరు నిర్మాణాలు ప్రారంభించినా పునాదుల దశలో వదిలేశారు. ప్రస్తుతం అక్కడ ఏర్పాటు చేసిన చేతిపంపులు కూడా పాడైపోయాయి. పోలవరంలో కొందరు ఇళ్లు నిర్మించుకోగా.. చాలామంది వసతులు లేవని ముందుకు రావడం లేదు. వర్షం వస్తే చాలు చుట్టూ చేరుతున్న నీరుతో ఇళ్లు నిర్మించుకున్నవారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పెడన మండలంలోని కమలాపురం, చేవేంద్ర, కొప్పల్లి ఇలా అనేక గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. బంటుమిల్లిలో 620 ప్లాట్లతో లేఔట్‌ను ఏర్పాటు చేసి బంటుమిల్లి, మల్లేశ్వరం, రామన్నమోడి, నారాయణపురం గ్రామాల ప్రజలకు అక్కడ స్థలాలు కేటాయించారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదు. కృత్తివెన్ను మండలంలోని పల్లెపాలెం, ఎండపల్లి, మునిపెడ, పడతడిక తదితర గ్రామాల్లో కాలనీల్లో కూడా వసతులు లేవు. దీంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. బందరు మండలంలోని సుల్తానగరం ప్రజలకు కూడా పొలాల మధ్యలో స్థలాలు కేటాయించారు. అక్కడ మెరక చేయకపోవడంతో వర్షం వస్తే మోకాలి లోతు నీళ్లు చేరిపోతున్నాయి. ప్రస్తుతం అక్కడ ఇద్దరు మాత్రమే మెరక చేసుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.


బందరు మండలం చిట్టిపాలెంలో పొలాల మధ్యలో అధ్వానంగా కాలనీ

మండలం	లేఔట్లు	కేటాయించిన స్థలాలు
బందరు	72	6,185
బందరు(అర్బన్)	10	20,602
పెడన	36	940
పెడన(అర్బన్)	04	2,182
గూడూరు	39	1,577
బంటుమిల్లి	20	1,383
కృత్తివెన్ను	19	1,402
మొత్తం	200	34,271


కాలనీకి వెళ్లే రహదారి ఇలా..

కాలనీల్లో పరిస్థితులపై వివరాల సేకరణ

రెండు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో స్థలాలు ఊరికి దూరంగా ఇచ్చారని, వసతులు లేవని తదితర కారణాలతో చాలామంది ఇళ్లు నిర్మించకుండా వదిలేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు నిర్మించే క్రమంలో ఇప్పటివరకు ఎంతమంది స్థలాలు పొందారు.. ఎన్ని కాలనీలు ఏర్పాటు చేశారు.. అక్కడ ఎంతమంది ఇళ్లు నిర్మించుకున్నారు.. అసంపూర్తిగా వదిలేసినవారు ఏమంటున్నారు తదితర అంశాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వగా అవి చాలకపోవడంతో చాలామంది అప్పులు చేసి కట్టుకున్నారని కొందరు, అప్పులు పుట్టక, ఇచ్చిన మొత్తం చాలక వదిలేశామని ఇంకొందరు చెబుతున్నారు. కాలనీలు మెరక చేయకపోవడంతోపాటు అంతర్గత రోడ్ల అభివృద్ధి, తాగునీరు, విద్యుత్తు సౌకర్యం ఇలా అనేక వసతులు కల్పించాల్సి ఉంది. స్థానిక పరిస్థితులపై సచివాలయాల వారీగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నివేదిక సిద్ధం చేస్తున్నారు. అయితే ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకంలో భాగంగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే యూనిట్ విలువ రూ.4 లక్షలకు పెంచడంతో సొంతింటి కల నెరవేరుతుందని పేదలు ఆకాంక్షిస్తున్నారు.

వృత్తి విద్యపై అవగాహన

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యల పట్ల అవగాహన కల్పించేలా కృషి చేస్తున్నట్లు జిల్లా బాలికా సంరక్షణాధికారి సీతామహాలక్ష్మి, ఎడ్యుట్రయిన్ ఒకేషనల్ సమన్వయ కర్త కె.రవికాంత్ అన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో వృత్తివిద్యకోర్సుల్లో బోధన, శిక్షణ అందిస్తున్నారు. దీనిలో భాగంగా నగరంలోని చిలకలపూడి పాండురంగ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం స్థానికంగా ఉన్న పలు వస్త్రదుకాణాలు, సూపర్‌మార్కెట్లను సందర్శించగా నిర్వాహకులు వ్యాపార కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో 10 రోజులపాటు కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లపై భారం వేయకండి


కొనకళ్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేష్‌బాబు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల మరమ్మతుల భారం డ్రైవర్ల మీద పడకుండా చూడాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణను కోరారు. నారాయణను బుధవారం మచిలీపట్నంలో సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి సరిగా లేకపోవడం, ఎక్కువ బస్సులు పాతవి కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. మరమ్మతుల భారాన్ని డ్రైవర్ల మీద వేయడం వల్ల వాళ్లు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులకు వైద్య సదుపాయాలు అందడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. గత ప్రభుత్వంలో చిన్న, చిన్న కారణాలతో పలువురు ఆర్టీసీ కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అడ్వాన్స్ మొత్తాన్ని వడ్డీతో చెల్లించాలని తీర్పు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: గుడివాడకు చెందిన యు.రాజశేఖరం అదే ప్రాంతానికి చెందిన టి.రమేష్ వద్ద బహుళఅంతస్తుల భవనంలోని మూడో ఫ్లోర్‌లో ఫ్లాట్ కొనుగోలు నిమిత్తం 2022 సెప్టెంబరు 22న రూ.90 వేలు అడ్వాన్స్‌గా చెల్లించారు. మూడో ఫ్లోర్ అనుమతులపై ఆయన సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు తీసుకోగా రెండు ఫ్లోర్‌లకు మాత్రమే అనుమతి ఉన్నట్లు తెలిసింది. తాను కొనుగోలు చేసిన ఫ్లాట్‌కు అనుమతి లేని కారణంగా అడ్వాన్స్‌గా ఇచ్చిన మొత్తాన్ని ఇవ్వాలని రమేష్‌ను అడిగారు. ఎన్నిసార్లు అడిగినా ఫలితం లేకపోవడంతో వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం విచారణ నిర్వహించగా అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.90 వేలను 9 శాతం వడ్డీతో చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డిలు తీర్పు ఇచ్చారు. మానసిక వేదన కలిగించినందుకు రూ.15 వేలు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అదనంగా ఫిర్యాదుదారుకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరునెలల జైలుశిక్ష

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. మచిలీపట్నంకు చెందిన బి.మధుసూదనరావు అదే ప్రాంతానికి చెందిన జి.శివనాగమురళీకృష్ణవద్ద 2017 ఏప్రిల్ 16న రూ.3లక్షలు అప్పుతీసుకున్నాడు. అప్పుచెల్లించే క్రమంలో 2019 సెప్టెంబరు 17న ఆంధ్రాబ్యాంకు మచిలీపట్నం జడ్పీ బ్రాంచిలో చెల్లేలా రూ.3 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును మురళీకృష్ణ బ్యాంకులో వేయగా చెల్లదని తేలడంతో కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. బుధవారం దీనిపై విచారణ నిర్వహించగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో 6 నెలల జైలు శిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎన్.మేరి తీర్పు చెప్పారు. జైలుశిక్షతోపాటు రూ.3 లక్షల నష్టపరిహారం ఫిర్యాదుదారుకు చెల్లించాలని, చెల్లించకపోతే అదనంగా మరో 3 నెలలు జైలుశిక్ష విధించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నట్లు ఫిర్యాది తరపున వాదనలు వినిపించిన న్యాయవాది బోగిరెడ్డి వెంకన్నబాబు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

పెడన, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ మచిలీపట్నం కోర్టు బుధవారం ఆదేశాలు జారీచేసింది. భార్యాభర్తలైన నిమ్మగడ్డ రమేష్, ధనలక్ష్మిల మధ్య ఈనెల 7న వివాదం జరిగింది. అదేరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో భర్త తనను ఇంటి మొదటి అంతస్తు నుంచి కిందకు తోసేసినట్లు ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమికంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసులు నిందితుడైన రమేష్‌పై హత్యాయత్నం కింద కేసు నమోదుచేశారు. బాధితురాలు మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఇరువురికి ఏడాది కిందట ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి వివాహం చేసుకున్నారు. ఈ దంపతుల మధ్య అనతి కాలంలోనే విభేదాలు వచ్చాయి.

నాటుసారా బట్టీపై దాడి

పెడన, న్యూస్‌టుడే: స్థానిక వైఎస్సార్ కాలనీలో నాటుసారా బట్టీపై బుధవారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 లీటర్ల నాటుసారా, గ్యాస్ స్టౌవ్, సిలెండర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దక్షిణ తెలుగుపాలేనికి చెందిన నిందితుడు గుడిసె ప్రశాంత్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై జి.సత్యనారాయణ చెప్పారు. నిందితుడిపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈదాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, మహిళా సంరక్షణ కార్యదర్శి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం


మచిలీపట్నం: బలరామునిపేట విశ్వేశ్వరాలయంలో...


సుల్తానగరంలో సరస్వతీదేవిగా...


పోతేపల్లిలో...


పెడన: సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన పైడమ్మతల్లి


పెడన: చదువుల తల్లిగా కన్యకాపరమేశ్వరి


పెనుమల్లి శివ నాగదుర్గ దేవాలయంలో..


జిల్లా కోర్టు ప్రాంగణంలో అమ్మవారికి హారతి ఇస్తున్న జిల్లా జడ్జి అరుణసారిక

న్యూస్‌టుడే బృందం : పలు దేవాలయాలతోపాటు వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉత్సవ పందిళ్లలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు.


బంటుమిల్లి: పాశ్చాపురంలో..


మచిలీపట్నం: దత్తాశ్రమంలో పూజలు


సుల్తానగరంలో..


గీతా మందిరంలో..


భారతీహిందీ విద్యాలయంలో..


గూడూరు: తరకటూరులో వేదవ్యాస్ పూజలు


ఐదుగుళ్లపల్లిలో..

గో ధ్వజస్థాపన విజయవంతం చేద్దాం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విజయవాడలో ఈనెల 10న నిర్వహించనున్న గోధ్వజ స్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అంటూ వాసుదేవ గోశాల నిర్వాహకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. బుధవారం మచిలీపట్నంలో కార్యక్రమ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోమాతకు జాతీయ మాతగా గౌరవం ఇవ్వడం, గోహత్యను నిలిపివేసే దేశాన్ని నిర్మించేందుకు గో ప్రతిష్ఠా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామీజీ దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో గోధ్వజాన్ని స్థాపించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 10న విజయవాడలోని సత్యనారాయణపురం శివరామకృష్ణక్షేత్రంలో గోధ్వజస్థాపన చేస్తున్నారన్నారు. గోధ్వజ స్థాపన యాత్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు పీవీ ఫణికుమార్, దూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, బత్తిన అగస్తేశ్వరరావు, ఈడే భాస్కరరావు, వేముల బజ్జి, మైనంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న పల్లపాటి సుబ్రహ్మణ్యం తదితరులు

పెడనలో తాగునీటి సరఫరాకు అంతరాయం


పైపులైన్ పగిలిన ప్రాంతంలో మరమ్మతు పనులు

పెడన, న్యూస్‌టుడే: పెడనలో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి బస్టాండు సెంటరులోని 1000 కేఎల్ రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసే 250 ఎంఎం ప్రధాన పైపులైన్ స్థానిక ఆర్టీసీ బస్టేషన్‌కు సమీపంలో భూమి లోపల పగిలి పోవడంతో పంపింగ్ నిలిచిపోయింది. ఫలితంగా పట్టణంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచింది. గురువారం కూడా అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. పైపులైన్ పునరుద్ధరణ పనులను హుటాహుటిన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, ఏఈ సీతారామాంజనేయులు, కౌన్సిలర్ కటకం ప్రసాద్ తదితరులు పైపులైన్ పగిలిన ప్రాంతాన్ని పరిశీలించారు. పైపులైన్లు 25 ఏళ్ల నాటివి కావడంతో నీటి పీడనానికి తరచూ లీకులు ఏర్పడి సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

ఉపాధ్యాయుడి మృతి

పెడన, న్యూస్‌టుడే: స్థానిక జ్ఞాన కోటయ్య హైస్కూలు సైన్స్ ఉపాధ్యాయుడు కేఎల్ఎస్ కుమార్(59) మంగళవారం రాత్రి మచిలీపట్నం శంకరమఠం సమీపంలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. కుమార్ చిత్రకారుడిగా మంచి పేరు గడించారు. సమాచారం తెలిసిన వెంటనే హైస్కూలు హెచ్ఎం బళ్ల తీర్థావతి, యూటీఎఫ్ నాయకుడు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

కంచడం వీఆర్వో..

బంటుమిల్లి: కంచడం వీఆర్వో సీహెచ్ నాగనాంచారయ్య(46) బుధవారం మృతి చెందారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం వాడవల్లికి చెందిన ఆయన గత కొన్ని సంవత్సరాలుగా కంచడం వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూసేసరికి ఆయన మరణించి ఉన్నారని తెలిసింది. తహసీల్దార్ భరత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఏకాగ్రతకు చిత్రలేఖనం దోహదం

మచిలీపట్నం(గొడుగుపేట): విద్యార్థుల్లో ఏకాగ్రత మెరుగుకు చిత్రలేఖనం దోహదపడుతుందని స్టార్ విద్యాసంస్థల డైరెక్టర్ పి.శ్రీరామ్ అన్నారు. మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని బుధవారం నగరంలోని ఏపీటీఎఫ్ భవనంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకులు బిఎస్‌వీ రమేష్, ఉపాధ్యాయులు అంబటిపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

పంచాయతీల ఆదాయం సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాద్

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి పంచాయతీకి వచ్చే ఆర్థిక వనరులను ఆయా సర్పంచులు, కార్యదర్శులు గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. బుధవారం కంకిపాడు మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచులు తమ విధులు, విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా గ్రామంలో తాగునీరు, వీధిదీపాలు, రహదారులు, డ్రైనేజిలు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం గ్రామాల్లోని సమస్యలపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెర్సు రాజ్యలక్ష్మి, ఎంపీడీవో అనూష, తాడిగడప మున్సిపల్ తెదేపా అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ల ఏర్పాటు ఘనత తెదేపాదే

కానూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో రైతుబజార్లను ఏర్పాటు చేసిన ఘనత తెదేపాదేనని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. బుధవారం తాడిగడప పురపాలక సంఘం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన రైతుబజారును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో రాష్ట్రంలోనే తొలిసారిగా రైతు బజారును పెనమలూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేశామన్నారు. వాటి వల్ల అటు రైతులకు, ఇటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎన్నికల అనంతరం మాట ఇచ్చిన విధంగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పి.భవానీ ప్రసాద్, వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవికిరణ్, అంగిరేకుల మురళి, ఎం.ధనకోటేశ్వరరావు, చంటి, టి.రామ్‌కుమార్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు శ్మశాన స్థలాలు కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాలమహానాడు రాష్ట్ర ప్రతినిధులు

కంకిపాడు, న్యూస్‌టుడే : జిల్లాలో 80 శాతం ఎస్సీ కాలనీలకు శ్మశాన స్థలాలు అందుబాటులో లేక దళితులు అవస్థల పాలవుతున్నారని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కంకిపాడు మండల స్థాయిలో ఇదే అంశంపై బుధవారం తహసీల్దార్ భవన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డొంకలు, పోరంబోకు స్థలాలు, రహదారుల అంచుల్లోనే మృతుల అంత్యక్రియలు నిర్వహిస్తున్నారన్నారు. పరిమితంగా ఉన్న స్థలం సమాధులతో నిండిపోవడంతో ప్రస్తుతం అంత్యక్రియల నిర్వహణ పెను భారంగా మారిందన్నారు. ప్రత్యేక శ్మశాన స్థలాలు ఉన్న చోట వాటి వరకు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులతో దళిత శ్మశాన స్థలాల అభివృద్ధి, ప్రహరీ నిర్మాణం, నీటి వసతి, షెడ్డు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సరిహద్దు ఆంథోని, రాయల్లి విల్సన్ పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

గంగూరు(పెనమలూరు), న్యూస్‌టుడే: ఐసీడీఎస్ కంకిపాడు శాఖ ఆధ్వర్యంలో గంగూరులో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు సర్పంచి తస్లీమున్నీసా బేగం చీరెలు, గాజులు, పసుపు, కుంకుమ, స్టీలు ప్లేట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, ఆకు కూరలను అధికంగా ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్‌బాషా, కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ అధికారులు బేబీసుకన్య, శ్రీలత, లిఖిత, జ్యోతి, విజయరాణి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై వంట నూనెల విక్రయం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం స్థానిక రైతుబజార్లలో వంటనూనెలను రాయితీపై అమ్మేందుకు సిద్ధమైంది. బుధవారం కంకిపాడు రైతుబజార్‌లో ఎంపీపీ నెర్సు రాజ్యలక్ష్మి, తహసీల్దారు భావన్నారాయణల ఆధ్వర్యంలో వినియోగదారులకు రాయితీ వంట నూనెల అమ్మకాలను ప్రారంభించారు. దీనిలో పామాయిల్ రూ.114, సన్‌ఫ్లవర్ ఆయిల్ 124గా నిర్ధారించారు. రాయితీపై టమాటా అమ్మకం కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, చలువాది రాజా, బి.వెంకట్, కల్యాణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమోస్తుతే..



పెనమలూరు గౌడరామాలయంలో..



ఉయ్యూరు(గ్రామీణం): పెద ఓగిరాలలో..



ఉయ్యూరు: శివాలయంలో..



ఉయ్యూరు: ఏజీకేనగర్ విజయదుర్గా భవానీదేవి ఆలయంలో..



రంగన్నగూడెం ఉత్సవ పందిరిలో చిన్నారుల పూజలు



కాటూరులో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ పూజలు



గన్నవరం (గ్రామీణం): దావాజీగూడెం శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో..



రామవరప్పాడు: పేరంటాలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు దంపతులు



కంకిపాడు: ఎమ్మెల్యే బోడే, చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



కంకిపాడు (గ్రామీణం): ఉప్పులూరులో..



కంకిపాడు: కన్యకాపరమేశ్వరి మందిరంలో అర్చకస్వామి మహేష్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ తదితరులు

న్యూస్‌టుడే బృందం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జగన్మాత జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజున సరస్వతీ దేవిగా కొలువుదీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ✦ రామవరప్పాడులోని శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ వార్లను గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు దర్శించుకున్నారు. అనంతరం రాజుల బజారులోని అమ్మవారి పుట్టిల్లు వద్ద శ్రీ హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ✦ కంకిపాడు శివాలయంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కమ్మ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్ అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రసాదంపాడు: సాయిబాబా ఆలయంలో..



పోరంకి: శ్రీనివాసనగర్ కాలనీ శ్రీ సాయిబాబా ఆలయంలో..



పోరంకి: నారాయణపురం కాలనీ శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ...



గన్నవరం: చిక్కవరంలో..



కానూరు తాడిగడప గ్రీన్‌సిటీలో..



కానూరు: తాడిగడప రామాలయంలో..



హనుమాన్‌జంక్షన్: కొత్తపల్లిలో..

ఉదారం.. ఉపయుక్తం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బొమ్ములూరు వద్ద పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో భవానీ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతి శిబిరానికి బుధవారం భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఇక్కడ రెండు పూటలా అల్పాహారం, భోజనంతో పాటు, విశ్రాంతి తీసుకునేందుకు బస, ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి నడిచి వస్తున్న భక్తుల పాదాలకు బొబ్బలు రావడంతో సతీష్‌కుమార్ స్వయంగా వారి పాదాలకు లేపనం రాశారు.

ఉచిత మెగా పశువైద్యశిబిరం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కోలవెన్నులో బుధవారం ఉచిత మెగా పశు వైద్యశిబిరం నిర్వహించారు. దీనిలో కోలవెన్ను గ్రామంతో పాటు సమీప గ్రామాలకు చెందిన పశు పోషకులు పశువులను వైద్యశిబిరానికి తీసుకుని వచ్చారు. వైద్యులు వాటికి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దూడలకు నట్టల నివారణ మందులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) పాల్గొన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రంగారావు, రవికుమార్, మాధవరావు, జేవీవో శ్రీనివాసరావు, కొండలరావు, నరసింహారావు, సిబ్బంది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ



పూజల్లో కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే, శ్రీదుర్గా రవీంద్ర గురుస్వామి తదితరులు

ఈడుపుగల్లు (కంకిపాడు గ్రామీణం), న్యూస్‌టుడే: శబరిమలై 18వ వార్షిక యాత్రను పురస్కరించుకుని ఈడుపుగల్లులో బుధవారం రాత్రి పర్వతనేని శ్రీదుర్గారవీంద్ర గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, గురుస్వాములు కోసూరు శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. శ్రీసాయి మణికంఠ భజన బృందం (రాజా గురుస్వామి) ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

అక్రమార్కుల బరితెగింపు

కంకిపాడు, న్యూస్‌టుడే

ఉచిత ఇసుక విధానం ఇంకా గాడిలో పడలేదు. దీనిలో లోటుపాట్లను ఆసరాగా తీసుకుని కొందరు యథేచ్ఛగా అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. వీరికి రాజకీయ నేపథ్యం లేకున్నా సంబంధిత శాఖల అధికారులను 'ప్రసన్నం' చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఎగుమతి చేస్తున్నారు. వీటికి రైతుల ఎడ్ల బళ్లు, గృహ నిర్మాణం వంటి సాకులతో పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నారు.

రొయ్యూరులో ఎగుమతి.. మద్దూరులో దిగుమతి

ఇటీవల సంభవించిన వరదకు మద్దూరులో క్వారీ దారి ధ్వంసమైంది. దీంతో ఇక్కడ ఇసుక తోలకం కష్టం అవడంతో సమీప రొయ్యూరు క్వారీపై కన్నేశారు. వందల సంఖ్యలో ఎడ్ల బళ్లతో మద్దూరు పరిధిలోని ఖాళీ ప్రదేశాల్లో వందల టన్నుల ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. రెండు ఎడ్ల బళ్ల లోడుతో ఒక ట్రాక్టరు నిండుతుంది. ఒక్కో ట్రాక్టరుకు రూ.3 వేలు తీసుకుంటున్నారు. కొందరు అక్రమార్కులు రైతుల వద్ద నుంచి వ్యాపారం కోసం ఎడ్లు, బళ్లను అద్దెకు తీసుకొని అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. వారికి కూలి రూ.750 తోలకందార్లకు ఇచ్చి మిగత సొమ్ము పెట్టుబడిదారులు తీసుకుంటున్నారు. ఇక ట్రాక్టరు దూరాన్ని బట్టి రూ. ఐదారు వేలకు విక్రయిస్తున్నారు.



మద్దూరు పరిధిలోని ఖాళీ ప్రదేశాల్లో గుట్టలు పోసి

అడ్డుకట్ట ముఖ్యం

ఇటీవల అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అధికారులు స్వాధీనం చేసుకోవడం విదితమే. అయితే ఇది నామమాత్రంగా 10లో ఒకటి రెండు మాత్రమే దొరుకుతున్నాయి. మిగతావి అడ్డదార్లలో అర్ధరాత్రి వేళ రవాణా చేస్తున్నాయి. ఉచిత ఇసుక తగిన పరిమాణంలో అందుబాటులో లేకపోవడమే అక్రమ రవాణాకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. దీన్ని ప్రతిపక్షాలు ఆసరాగా తీసుకుని సామాజిక మాధ్యమాల ద్వారా కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయి. ఉచిత విధానంలో లోటు పాట్లను సరిచేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కారు ఢీ.. మహిళకు గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: కారు ఢీ కొట్టిన సంఘటనలో మహిళకు బలమైన గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. సింగంశెట్టి నిర్మల తాడిగడప డొంకరోడ్డు నివాసి. ఆమె ఈ నెల 7వ తేదీ సాయంత్రం పాలప్యాకెట్ కోసం నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న ఓ కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో ఆమెకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ పెనమలూరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వేచ్ఛగా దరఖాస్తులు సమర్పించవచ్చు

11 వరకు స్వీకరణ.. 14న లాటరీ



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసచౌదరి, పక్కన అధికారులు సుబ్బారావు, సురేఖ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల లైసెన్స్‌లకు ఔత్సాహికులు స్వేచ్ఛగా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని.. అవసరమైతే సమీపంలోని ఎక్సైజ్ స్టేషన్లలో అయినా దరఖాస్తులు సమర్పించవచ్చని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసచౌదరి అన్నారు. గన్నవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లో జరుగుతున్న మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావుతో కలిసి బుధవారం పరిశీలించారు. స్టేషన్ పరిధిలో వచ్చిన దరఖాస్తులు, ఇతర వివరాలను అడిగి తెలుసుకొని మీడియాతో మాట్లాడారు. గన్నవరం ఎక్సైజ్ పరిధిలో 23 దుకాణాలకు గాను 235 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. 14వ తేదీ మచిలీపట్నం నోబుల్ కళాశాల, ఇబ్రహీంపట్నం స్వర్ణ కల్యాణమండపంలో లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తామని చెప్పారు. ప్రత్యేక పోలీస్ బందోబస్తుతో సిండికేట్లకు తావులేకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీఐ సురేఖ, సిబ్బంది రాణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల వేధింపులు ఆపాలి



కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఐద్వా ప్రతినిధులు కీర్తి తదితరులు

ఉయ్యూరు: ఉయ్యూరులో టిడ్కో గృహ లబ్ధిదారులకు బ్యాంకు అధికారుల ఒత్తిడి వల్ల ఇబ్బందిగా ఉందని ఐద్వా, సీపీఎం ప్రతినిధులు బుధవారం నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, వీధిలైట్లు వెలగడం లేదని, దోమల బెడద నివారణకు మందు పిచికారి చేయించాలనే ఇతరేతర సమస్యలను కమిషనర్‌కు వివరించారు. టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించే వరకు రుణాలు కట్టాల్సిన అవసరం లేదని కమిషనర్ చెప్పినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రాజేష్, ఐద్వా జిల్లా ప్రతినిధి కీర్తి, మండల కమిటీ సభ్యురాలు ప్రశాంతి, నాగమణి తదితరులున్నారు.

మానసిక ప్రశాంతత ముఖ్యం

ఎనికేపాడు, న్యూస్‌టుడే: ఎనికేపాడులోని ట్విల్స్‌లో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అయోధ్య ఆర్కే మాట్లాడుతూ. . ఒత్తిడితో కూడుకున్న పని వల్ల వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేయడంపైనే మానసిక ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఉద్యోగుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గమిని సుబ్బారావు, జయేశ్ గాలా పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

యనమలకుదురు(పెనమలూరు), న్యూస్‌టుడే : మెండెం హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు కీర్తి, ప్రతినిధులు బుధవారం పేదలు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. పేదలకు పండ్లు, పాలు అందజేశారు. యనమలకుదురు, రామలింగేశ్వరనగర్, కృష్ణలంక, బస్టాండ్, బెంజిసర్కిల్, ఆటోనగర్, చెక్‌పోస్ట్ కూడలి ప్రాంతాల్లో వీరు ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

175 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు


అలంకరణలో అమ్మవారు


చిన్నారికి అక్షరాభ్యాసం చేస్తున్న మాతాజీ

మామిళ్లపల్లి(పమిడిముక్కల) న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధి చెందిన మామిళ్లపల్లి సరస్వతీ దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. మాతాజీ ఆధ్వర్యంలో 175 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నసమారాధన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి ఇక్కడ అక్షరాభ్యాసం చేయించుకోవడం విశేషం.

అంకమ్మతల్లి జాతర



గరికపర్రు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : మండలంలోని గరికపర్రులో అంకమ్మతల్లి జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వీరంకి ఆడపడుచులు పెద్ద ఎత్తున తరలివచ్చి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు నడుమ అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రయాణమంటే హడల్

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే

పులిగడ్డలోని దివి ప్రధాన పంట కాల్వపై నిర్మించిన వంతెన నుంచి టోల్‌ప్లాజా వరకు ఉన్న అనుసంధాన రహదారి అధ్వానంగా ఉంది. కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. కి.మీ. రోడ్డులో కొంతభాగం కొట్టుకుపోగా మరికొంత కంకర తేలి నరకాన్ని తలపిస్తోంది. ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో మరీ నరకాన్ని తలపిస్తోంది. రేపల్లెకు దగ్గర దారి కావడంతో కార్లు, ద్విచక్ర వాహదారులు ఎక్కువ మంది ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు.


పులిగడ్డలో కొట్టుకుపోయిన అనుసంధాన రహదారి


కంకర తేలి ఇలా..

గత వైకాపా ప్రభుత్వంలో గుంతలు కూడా పూడ్చ లేదు

ఈ రహదారిపై ప్రయాణ మంటేనే భయమేస్తోంది. ద్విచక్ర వాహనం నడపాలంటే దడ పుడుతోంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఉంది. రాత్రి వేళల్లో మరీ ఇబ్బందిగా ఉంటోంది. వైకాపా ప్రభుత్వంలో కనీసం గుంతలు కూడా పూడ్చ లేదు. కూటమి ప్రభుత్వమైనా తక్షణం దీని బాగుచేతకు నిధులు మంజూరు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

- డి.శ్రీనివాసరావు, ద్విచక్ర వాహనచోదకుడు

అమ్మవారి సేవలో దేవాదాయ శాఖ కార్యదర్శి

కూచిపూడి, న్యూస్‌టుడే: మొవ్వ మండలం కూచిపూడిలో నాట్యాచార్యుల ఇలవేల్పయిన శ్రీబాలాత్రిపురసుందరీ అమ్మవారిని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి తిక్కిశెట్టి మోహనరావు(మచిలీపట్నం) దంపతులు బుధవారం దర్శించుకున్నారు. పాలక మండలి సభ్యులు భాగవతుల శరశ్చంద్ర, జ్యోశ్యుల జగన్మోహనరావు, భాగవతుల సీతాపతి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం మోహనరావు రామలింగేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్లపై భారం వేయకండి

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల మరమ్మతుల భారం డ్రైవర్ల మీద పడకుండా చూడాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణను కోరారు. నారాయణను బుధవారం మచిలీపట్నంలో సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సురేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి సరిగా లేకపోవడం, ఎక్కువ బస్సులు పాతవి కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. మరమ్మతుల భారాన్ని డ్రైవర్ల మీద వేయడం వల్ల వాళ్లు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

12న వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేకనూరు(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: వేకనూరులోని సంతాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 12న శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు దీవి కృష్ణమాచార్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సంతర్పణ గ్రామస్థుల భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న మురళీ కోలాటం పోటీలు

ఘంటసాల, న్యూస్‌టుడే: చిట్టూర్పు మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణా జిల్లాల పరిధిలో నిర్వహిస్తున్న మురళీ కోలాటం, తాళం భజన పోటీలు ఆకట్టుకున్నాయి. ఇందులో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. యార్లగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలకు చెందిన విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. నిర్వాహక కమిటీ సభ్యులు వరప్రసాద్, సుధీర్, సతీష్, సురేష్‌లు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? అవనిగడ్డ రెండో వార్డు ప్రధాన రహదారి మార్జిన్‌లో పాత కరెంట్ ఆఫీసు ఎదురుగా చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.
- శేఖర్, అవనిగడ్డ

✔ సిబ్బందిని పంపించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తాం - తోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, అవనిగడ్డ

? నాగాయలంక ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాల ఎదుట రోడ్డుపైనే వాహనాలు నిలిపి వేస్తుండడంతో ట్రాఫిక్‌ తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.
- వాహనదారులు

✔ వాహనాలు రోడ్డుపై నిలుపదల చేయకుండా చర్యలు తీసుకుంటాం
- కె.రాజేష్, ఎస్సై, నాగాయలంక

– న్యూస్‌టుడే, అవనిగడ్డ, నాగాయలంక


నియంత్రికకు మరమ్మతులు

స్పందనకు వందనం

నాగాయలంక, న్యూస్‌టుడే: రేమాలవారిపాలెం శివారు పెద్దవానిలంక రామాలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక పోవడంతో సోమవారం 'ఈనాడు'లో మేమున్నాం...మీకు తోడుగాలో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన మండల విద్యుత్తు అధికారి జి.వెంకటరాజు సమస్యను పరిష్కరించారు.


గుడివాడ: సామూహిక అక్షరాభ్యాసంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


చినపులపాడులో..


మోపిదేవిలో..


పామర్రులో అంకమ్మతల్లి


పార్వతి అమ్మవారు



పామర్రు గ్రామీణం: కొండిపర్రులో..


పెదపూడిలో..


నాగాయలంకలో..

విద్యాదాయినీ వందనం

దసరా వేడుకలు గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఘనంగా జరుగుతున్నాయి. కుంకుమ పూజలు, భజనలు, హోమాలు, రుద్రాభిషేకాలతో ఉత్సవ పందిళ్లు, ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. బుధవారం పలుచోట్ల అమ్మవారు సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు పోటెత్తారు. స్థానిక కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. - న్యూస్‌టుడే బృందం


చల్లపల్లిలో ..


కూచిపూడిలో..


మోపిదేవి: కొక్కిలిగడ్డ భ్రమరాంబ ఆలయంలో..


నాగాయలంక కన్యకా పరమేశ్వరి ఆలయంలో..


అవనిగడ్డ : చండీ హోమం చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కుటుంబ సభ్యులు


శ్రీకాకుళంలో అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు


పమిడిముక్కలలో..


నాగాయలంక: గణపేశ్వరంలో..


తోట్లవల్లూరు: శివాలయంలో..


తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలో..


పెదపారుపూడి: దేవస్థానంలో..


చినకళ్లేపల్లిలో..


వేకనూరులో సరస్వతీదేవిగా...


మందపాకలలో సరస్వతీదేవిగా..


అవనిగడ్డ కంచికామాక్షి అమ్మవారి ఆలయంలో..

నియోజకవర్గ అభివృద్ధికి రూ.23 కోట్లు మంజూరు

పామర్రు: నియోజకవర్గాభివృద్ధికి రూ.23కోట్లు మంజూరయ్యాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఐదు మండలాల పీఆర్, తదితర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న నిర్వహించే పల్లెపండగ కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ఈ రూ.23 కోట్లు ఏయే మండలాల్లో ఏయే పనులకు కేటాయించాలో అధికారులతో మాట్లాడి వీటికి సంబంధించిన అంచనాలను తయారు చేయించి అనుమతులు కోసం కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. అవసరమైన చోట ప్రహరీ నిర్మాణాలకు రూ.10లక్షలలోపు ఉన్న వాటికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

పెదపారుపూడి న్యూస్‌టుడే: మండలంలోని వానపాముల శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన 60 మంది విద్యార్థులతో అమ్మవారికి కుంకుమ పూజలు చేయించారు. అనంతరం ఆలయ అర్చకులు మామిళ్లపల్లి చిదంబరం తన సొంత డబ్బులు రూ.15 వేల విలువైన పరీక్ష ప్యాడ్లు, పుస్తకాలు అందజేశారు.

మద్యం దుకాణాలకు 197 దరఖాస్తులు

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ ఎక్సైజ్ సబ్ స్టేషన్ పరధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో 11 మద్యం దుకాణాలకు ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని సీఐ బి.వరాలరాజు తెలిపారు. మొవ్వ మండలం కూచిపూడి, మొవ్వ, నిడుమోలు, కాజ, ఘంటసాల మండలం కొడాలి, ఘంటసాల, శ్రీకాకుళం, చల్లపల్లి మండలం చల్లపల్లి-1, చల్లపల్లి-2, లక్ష్మీపురం కలిపి 11 దుకాణాలకు బుధవారం సాయంత్రానికి 197 దరఖాస్తులు అందాయన్నారు. మొవ్వ మండలంలో 4 దుకాణాలకు 42, చల్లపల్లి 89, ఘంటసాల 3 షాపులకు 66 దరఖాస్తులు వచ్చాయన్నారు.

పంచాయతీల పాలనపై శిక్షణ

పెదపారుపూడి న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీల పరిపాలన విధానంపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి వారికి ఐదు ప్రధాన అంశాలపై అవగాహన కల్పించారు.

ఘంటసాల, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో డి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నాగాయలంక, న్యూస్‌టుడే: పోస్టల్ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 10న మండలంలోని ఏటిమొగ తపాల కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆధార్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నాగాయలంక పోస్ట్‌మాస్టర్ టి.సురేష్ కుమార్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావేత్త ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని రాష్ట్ర సంప్రదాయ మత్స్యకారుల సంఘం నేత, తెదేపా జిల్లా నాయకుడు లకనం నాగాంజనేయులు కోరారు. బుధవారం తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నవంబర్ 6వ తేదీలోగా పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధిద్దాం

కపిలేశ్వరపురం(పమిడిముక్కల): రైతులు తమ అనుభవం, అధికారుల సూచనలతో అవసరమైన ఎరువులు, పురుగుమందులు వాడుతూ తక్కువ వ్యయంతో ఎక్కువ దిగుబడులు సాధించాలని జిల్లా రిసోర్సు సెంటర్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు జ్యోతి రమణి అన్నారు. బుధవారం కపిలేశ్వరపురం, వీరంకిలో జరిగిన సదస్సుల్లో ఆమె మాట్లాడారు.

నాగాయలంకలో విజిలెన్స్ దాడులు

నాగాయలంక, న్యూస్‌టుడే: మండలంలో విద్యుత్తు వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై విద్యుత్తు శాఖ విజిలెన్సు అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు ఆల్ఫాన్స్ ఆధ్వర్యంలో అధికారులు 29 బృందాలుగా ఏర్పడి 2,191 గృహ సర్వీసులు, 177 వాణిజ్య సముదాయాలు, ఇతర సర్వీసులు తనిఖీ చేశారు. వాటిలో 255 సర్వీసులకు వినియోగిస్తున్న అదనపు లోడు 321 కిలోవాట్స్‌కు రూ.7,012,800 జరిమానా విధించినట్లు ఆల్ఫాన్స్ తెలిపారు. విద్యుత్తు చౌర్యం సామాజిక నేరమని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డి.కృష్ణనాయక్, అవనిగడ్డ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాగాయలంక ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ ఇంజినీరు జి.వెంకటరాజు, ఉయ్యూరు డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న ఇబ్బంది

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నాగాయలంక, న్యూస్‌టుడే: నాగాయలంకలో ఐదు ఎరువుల దుకాణాలను బుధవారం అవనిగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు జె.ఎస్.జయప్రద, మండల వ్యవసాయాధికారి టి.శుభహారిక తనిఖీ నిర్వహించారు. దుకాణాల అనుమతులు, స్టాక్ రిజిస్టర్‌లు తనిఖీ చేశారు. ఓ దుకాణానికి అనుమతి పత్రం ఉండి ఫామ్ ఓ లేకుండా ఎరువులను విక్రయిస్తున్నట్లు గుర్తించి విక్రయాలు నిలిపేయాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు.


దస్త్రాలు తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ ఏడీ జె.ఎస్.జయప్రద

పట్టణంలో అన్నదానాలు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో తెదేపా నేత కామేపల్లి తులసిబాబు జన్మదిన వేడుకలు బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నాయకులు చేవూరు జగన్ మోహన్‌రావు, పెద్దు శ్రీకాంత్, కడియాల గణేష్, నిమ్మగడ్డ సత్య సాయి తదితరులు పాల్గొన్నారు. పార్కు వద్ద గల అన్నక్యాంటీన్‌లో టీఎన్ఎస్ఎఫ్ నేత సయ్యద్ జబీన్ ఆధ్వర్యంలోను, శాంతి వృద్ధాశ్రమంలోని శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలోను, ఏజీకే పాఠశాల వద్ద గల అన్నక్యాంటీన్‌లో ఫ్రెండ్ ప్రోగ్రసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలోను అన్నదానం చేశారు. కొత్తపేటలో జనసేన నేత పులపా మహేష్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు. జీవీఆర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరామ్ 500 మందికి అన్నదానం చేశారు. కొత్త పురపాలక సంఘ కార్యాలయం వద్ద భారీ అన్నదానం చేశారు


తులసిబాబు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న తెదేపా నాయకులు, అభిమానులు

కిడ్నీ బాధితుడికి సాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లికి చెందిన సుభానీకి రెండు కిడ్నీలు దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో చల్లపల్లిలోని ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల 1993-94 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.27వేలు సాయాన్ని బుధవారం అందించారు.

అడ్వాన్స్ మొత్తాన్ని వడ్డీతో చెల్లించాలని తీర్పు

మచిలీపట్నం: గుడివాడకు చెందిన యు.రాజశేఖరం అదే ప్రాంతానికి చెందిన టి.రమేష్ వద్ద బహుళఅంతస్తుల భవనంలోని మూడో ఫ్లోర్‌లో ఫ్లాట్ కొనుగోలు నిమిత్తం 2022 సెప్టెంబరు 22న రూ.90 వేలు అడ్వాన్స్‌గా చెల్లించారు. మూడో ఫ్లోర్ అనుమతులపై ఆయన సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు తీసుకోగా రెండు ఫ్లోర్‌లకు మాత్రమే అనుమతి ఉన్నట్లు తెలిసింది. తాను కొనుగోలు చేసిన ఫ్లాట్‌కు అనుమతి లేని కారణంగా అడ్వాన్స్‌గా ఇచ్చిన మొత్తాన్ని ఇవ్వాలని రమేష్‌ను అడిగారు. ఎన్నిసార్లు అడిగినా ఫలితం లేకపోవడంతో వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం విచారణ నిర్వహించగా అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.90 వేలను 9 శాతం వడ్డీతో చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు చింతలపూడి కిషోర్ కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డిలు తీర్పు ఇచ్చారు. మానసిక వేదన కలిగించినందుకు రూ.15 వేలు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అదనంగా ఫిర్యాదుదారుకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

త్వరలో రెండు ఇసుక క్వారీలు ప్రారంభం


రొయ్యూరు క్వారీని పరిశీలిస్తున్న ఆర్డీవో సంపత్‌షారన్, తహసీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో నార్త వల్లూరు, రొయ్యూరు గ్రామాల్లో రెండు ఇసుక క్వారీలు ప్రారంభం కాబోతున్నాయని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి బుధవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉయ్యూరు ఆర్డీవో సంపత్‌షారన్, రెవెన్యూ యంత్రాంగం గత రెండు రోజుల నుంచి ప్రభుత్వ క్వారీలు ఏర్పాటుపై సర్వే చేపట్టారు. రొయ్యూరు గ్రామంలో రెండుచోట్ల, నార్తువల్లూరులో మూడుచోట్ల ఇసుక క్వారీల ఏర్పాటుకు సర్వే చేశామని తహసీల్దార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టరు సీజ్

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెం పరిధిలో రాత్రుళ్లు అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టరును పట్టుకున్నామని ఎస్సై అర్జునరాజు బుధవారం తెలిపారు. డ్రైవర్ సత్యనారాయణ, యాజమాని శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

తక్కువ ధరకే వంట నూనెలు


రైతుబజారులో వంటనూనె విక్రయాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కోట విజయరాధిక

చల్లపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్లలో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు వంటనూనెను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ కోట విజయరాధిక అన్నారు. చల్లపల్లి రైతుబజారులో సన్‌ఫ్లవర్ ఆయిల్ (ఫ్రీడమ్), పామాయిల్‌ను తక్కువ ధరకు విక్రయించే కేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. పీడీఎస్ డీటీ శ్రీనివాస్, ఉపసర్పంచి ముమ్మనేని నాని, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి ఎల్.నిత్యానందం, ఆర్.ఐ.ఘంటసాల కృష్ణమోహన్, రైతుబజారు ఎస్టేట్ అధికారి ఎల్.బలిచక్రవర్తి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సలహా సంఘం సభ్యురాలిగా కృష్ణకుమారి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వీరమహిళ బచ్చు కృష్ణకుమారిని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సలహాసంఘం సభ్యురాలిగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పలువురు ఆమెను సత్కరించారు. కృష్ణకుమారితో పాటు నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావు, తుంగల వెంకటగిరిలకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

7 క్వింటాళ్ల చౌక బియ్యం పట్టివేత


పట్టుకున్న పీడీఎస్ బియ్యం ఆటోతో నిందితులు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఉల్లిపాలెం వారధి వద్ద బుధవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. అప్పుడు ఇద్దరు వ్యక్తులు ఆటో, ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.చాణక్య చెప్పారు. కేసు నమోదు చేసి ఆటో, బియ్యం బస్తాలు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



సృష్టికి మూలం.. శక్తి రూపం


కెనాల్ రోడ్డు వద్ద క్యూలైన్లలో భక్తులు


మూలానక్షత్రం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున బారులు


భక్తులకు తాగునీరు అందిస్తూ..


కృష్ణమ్మకు నదీ హారతి..


కేరళ డప్పు వాయిద్యాలతో..


నగరోత్సవం

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వెళ్లే క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీమాతను దర్శించుకోవడానికి బుధవారం తెల్లవారుజాము నుంచే లక్షల మంది బారులుదీరారు. - న్యూస్‌టుడే బృందం


ఆలయంలో పూలతో అలంకారం..


మహిళలు, చిన్నారుల కోలాటం


వన్‌టౌన్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డుపై ఆంక్షలతో భక్తుల అగచాట్లు


హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి బస్టాండ్ వైపు నిలిచిన ట్రాఫిక్


సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వచ్చిన నృత్యకారులు




సాంస్కృతిక ప్రదర్శనలు...

11 నుంచి నారీశక్తి ఉత్సవం

కృష్ణానదీ తీరాన నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు


నదిలో బోట్లలో ఏర్పాటు చేసిన నవదుర్గల బొమ్మలు

భవానీపురం, న్యూస్‌టుడే : కృష్ణానదీ తీరాన పున్నమి ఘాట్ వద్ద ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న నారీశక్తి ఉత్సవం కార్యక్రమానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నదీ తీరం వెంబడి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి వేదికల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇసుక తీసుకొచ్చే బోట్లలో నవదుర్గల భారీ బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వేదిక వెనుక వైపున కృష్ణానదిలో వాటిని బోట్లలో ఏర్పాటు చేశారు. స్టాల్స్ పనులు కూడా చేస్తున్నారు.

వేద.. స్మార్త.. పాఠాల బోధన

రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న పాఠశాల

దుర్గగుడి ఆధ్వర్యంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం

ఈనాడు, అమరావతి


వేద పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద, స్మార్త పాఠశాలలో ఏటా వందల మంది విద్యార్థులు వేదాభ్యాసం చేస్తున్నారు. 20 ఏళ్ల కిందట 30 మందితో ఆరంభించిన పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ.. దశాబ్దాలుగా వేద, స్మార్త పాఠాలను విద్యార్థులకు నేర్పిస్తోంది. ప్రస్తుతం 110 మంది విద్యార్థులు దుర్గగుడి వేద పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. పదేళ్ల కిందటి వరకూ దుర్గగుడి ప్రాంగణంలోనే ఈ పాఠశాల ఉండేది. దుర్గగుడి పాత మెట్ల మార్గం పక్కనే ఉండే భవనంలో ఈ పాఠశాల కొనసాగేది. ఆ తర్వాత విజయవాడ శివారులోని పోరంకిలో ప్రత్యేకంగా పాఠశాలను నిర్మించి అక్కడికి తరలించారు. ప్రస్తుతం అక్కడే పాఠశాల కొనసాగుతోంది. ఎనిమిది, 12ఏళ్ల కాల వ్యవధితో కృష్ణ యజుర్వేదానికి సంబంధించిన రెండు కోర్సులను అందిస్తున్నారు. ఏటా మే నెలలో వేద పాఠశాలలో ప్రవేశాలకు పత్రికా ప్రకటన ఇచ్చి.. ప్రక్రియ నిర్వహిస్తుంటారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో అర్హులైన వారికి ప్రవేశాలు కల్పిస్తారు. పాఠశాల ప్రాంగణంలోనే ఉచిత వసతి, భోజన సౌకర్యం కూడా కల్పిస్తారు. ఉపనయనం పూర్తయిన వారు మాత్రమే ప్రవేశాలకు అర్హులు. వేదం చదువుకోవాలని ఆసక్తి ఉండి, ఆర్థిక ఇబ్బందులతో ఉపనయనం చేయించుకోలేని వారి కోసం సామూహిక ఉపనయనాలను సైతం దుర్గగుడి ఆధ్వర్యంలోనే నిర్వహిస్తుంటారు. వేద పాఠశాలలో ఏటేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. 30 మందితో ఆరంభించగా.. తర్వాత ఏటేటా పెరుగుతూ 40, 50, 70, 100 ఇలా పెరుగుతూ వెళ్తున్నారు. ప్రస్తుతం 110 మంది విద్యార్థులకు చేరారు. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఏటా బయటకు వెళ్లడం, కొత్తవాళ్లు రావడం జరుగుతోంది.

ఉత్సవ వసతులపై 92 శాతం భక్తుల సంతృప్తి

చిట్టినగర్, న్యూస్‌టుడే: దుర్గమ్మ అనుగ్రహంతో రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో కరవులేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. రాజధాని నిర్మించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. కూటమిపై నమ్మకంతో గెలిపించిన ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చేందుకు ప్రభుత్వానికి జగన్మాత అనుగ్రహం ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ఆదేశాల మేరకు దేవాదాయశాఖతో పాటు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చక్కగా చేశారన్నారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని, ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.


మంత్రి రామానాయుడు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో రామారావు, వేదపండితులు

అపూర్వం.. జ్ఞానప్రదాయిని దర్శనం


అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులు


మంత్రి సవితకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి: దసరా శరన్నవ వేడుకల్లో జ్ఞానప్రదాయని సరస్వతీ దేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి సవిత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లలో ఇబ్బందులను భక్తులను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్వర్ణవీణాధారిణిగా అమ్మవారి రూపం అపూర్వం అన్నారు. భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదాల లోటు లేకుండా అందించామన్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

☛ జగన్మాతను జిల్లా కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న వేర్వేరుగా దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. అధికారులు వారికి అమ్మవారి చిత్రపటం శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో


ఆశీర్వచన మండపంలో సీపీ రాజశేఖర్‌బాబు కుటుంబం

నేటి అలంకారం శ్రీ దుర్గాదేవి

10-10-2024, గురువారం



విద్యుద్దామ సమప్రభాం మృగపతి స్కందస్థితాం భీషణాం
కన్యాభిః కరవాలఖేట విలసద్దస్తాభిరాసేవితాం
హస్తైశ్చక్రగదాసిఖేట విసిఖాంశ్చాపం గుణం తర్జనీం
బిభ్రాణాం అనలాత్మికాం శశిధరాం దుర్గాం త్రినేత్రాం భజే॥

దుర్గముడనే రాక్షస సంహారం చేసిన శక్తిస్వరూపం దుర్గాదేవి. కోటిసూర్య ప్రభలతో వెలుగొందే ఈ దేవి భక్తులను సర్వదుర్గతుల నుంచి కాపాడుతుంది. ఈమె మహా ప్రకృతి స్వరూపిణి. ఈ తల్లి ఉపాసన ద్వారా ఈతి బాధలు నశిస్తాయి. గ్రహబాధలు తొలగుతాయి. ఎర్రని వస్త్రాలు ధరించి, ఎర్రని పూలు, అక్షతలతో అమ్మను పూజించి, పులగం నివేదన చేయాలి. **ఓం దుం దుర్గాయై నమః** అనే మంత్రాన్ని జపించాలి. దుర్గాసూక్తం, లలిత అష్టోత్తరం, దుర్గాస్తోత్రాలు పారాయణ చేయాలి. వేదపండితులను ఈరోజు సత్కరిస్తే అమ్మ సంతోషిస్తుంది.

జగన్మాత సేవలో జస్టిస్ దుప్పల వెంకటరమణ


జస్టిస్ దుప్పల వెంకటరమణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ బుధవారం సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం జస్టిస్ వెంకటరమణకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

వైకాపా నేత దేవినేని అవినాష్‌కు అంతరాలయ దర్శనం

- మూలానక్షత్రం రోజున అడ్డదారిలో తీసుకొచ్చిన సిబ్బంది
- ఉన్నతాధికారుల తీవ్ర ఆగ్రహం.. టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు
- విధుల నుంచి ఇద్దరు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది తొలగింపు

ఈనాడు, అమరావతి, ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

విజయవాడ దుర్గగుడిలో నిబంధనలకు విరుద్ధంగా వైకాపా నేత దేవినేని అవినాష్, ఆయన కుటుంబ సభ్యులను అడ్డదారిలో తీసుకొచ్చి మరీ అంతరాలయ దర్శనం బుధవారం చేయించారు. మూలానక్షత్రం రోజున ప్రొటోకాల్ ఉన్న ప్రముఖులకు మినహా ఎవరికీ అంతరాలయ దర్శనాలు లేవని, అన్ని క్యూలైన్లు ఉచితమేనని అధికారులు ముందురోజే ప్రకటించారు. అంతరాలయంలోకి ఎవరూ ప్రవేశించకుండా గేట్‌కు తాళం వేశారు. కానీ వైకాపా నేతలకు మాత్రం ఎలాంటి నిబంధనలు అడ్డులేవన్నట్టుగా కొందరు దేవస్థానం సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన దేవాదాయ శాఖ అధికారులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన తర్వాత ఆ సమయంలో విధుల్లో ఉన్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రత్నారెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు మరో ఇద్దరు ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు చెందిన గార్డులను విధుల నుంచి తప్పించారు.

దసరా ఉత్సవాల్లో ఘాట్‌రోడ్డు వైపు నుంచి తప్ప.. కనకదుర్గానగర్ మీదుగా మహామండపం లిఫ్ట్ మార్గంలో నుంచి ఎవరూ రావడానికి వీల్లేదంటూ దేవాదాయశాఖ మంత్రితో పాటు కమిషనర్ సహా ఉన్నతాధికారులంతా కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. అలాంటిది.. మూలానక్షత్రం రోజున ఎలాంటి ప్రొటోకాల్ లేని వైకాపా నాయకుడు దేవినేని అవినాష్, ఆయన కుటుంబాన్ని అడ్డదారిలో దర్జాగా లిఫ్టు మార్గంలో తెల్లవారుజామున ఒంటి గంటన్నర సమయంలో కొండపైకి తెచ్చారు. భక్తులు దర్శనాలు చేసుకుని కిందకు వెళ్లే మార్గం వైపు నుంచి అడ్డదారిలో అంతరాలయం వద్దకు తీసుకొచ్చారు. అంతరాలయం వద్ద వేసిన గేటు తాళం కూడా తెరిచి.. లోపలికి తీసుకెళ్లి తొలి దర్శనం చేయించడం ప్రస్తుతం వివాదంగా మారింది. మూలా నక్షత్రం రోజున ప్రొటోకాల్ ఉన్న ప్రముఖులకు తప్ప అంతరాలయ దర్శనం ఎవరికీ లేదని దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టంగా ప్రకటించారు. దసరా ఉత్సవాలు పూర్తయ్యేవరకు లిఫ్టు మార్గంలో ఎటువంటి దర్శనానికి భక్తులను అనుమతించేది లేదని నగర పోలీసు కమిషనరు రాజశేఖర్ బాబు ప్రకటించారు. కానీ కొందరు సిబ్బందికి ఇవేవీ పట్టడం లేదు. మహామండపం లిఫ్ట్ మార్గంలో పైకి రావాలంటే.. కచ్చితంగా చాలామంది సహకారమే ఉండాలి. పోలీసులు కూడా అడ్డుకుంటారు. అలాంటిది ఇద్దరు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు అవినాష్ కుటుంబాన్ని వెంటబెట్టుకుని కొండపైకి ఎలా వచ్చారన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. పైగా అంతరాలయ గేటు తాళం తీయాలంటే ప్రధాన ఆలయంలో విధులు నిర్వహించే ఏఈవో, సూపరింటెండెంట్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అనుమతి ఉండాలి. కానీ ఎలాంటి ప్రొటోకాల్ లేనప్పటికీ ఎలా గేటు తాళం తీశారనేది ప్రస్తుతం వివాదంగా మారింది. ఈ ఘటనలో చాలామంది అధికారుల నిర్లక్ష్యమే ఉన్నా.. కావాలని కిందిస్థాయిలో విధులు నిర్వహించే టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌ను బాధ్యుడిని చేసి చేతులు దులిపేసుకున్నారనే విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి.

పోతిన మహేష్ విషయంలోనూ వివాదం..

వైకాపా నాయకుడు పోతిన మహేష్ కుటుంబం, అనుచరులతో కలిసి మూడు రోజుల కిందట అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు కూడా ఎలాంటి ప్రొటోకాల్ లేదు. అయినా దర్జాగా మహేష్ కుటుంబంతో పాటు వచ్చిన వాళ్లందరినీ అంతరాలయం లోనికి అనుమతించారు. ఆ తర్వాత ఆశీర్వచనం అందించి, స్వయంగా ఈవో వచ్చి చిత్రపటాన్ని అందజేశారు. ఆ తర్వాత కొండపై ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ మైక్ పాయింట్ వద్దకు మహేష్ వచ్చి మాట్లాడి వెళ్లారు. ఇదికూడా తీవ్ర దుమారాన్ని రేపింది. గతంలో వైకాపా అధికారంలో ఇదే మహేష్ జనసేనలో ఉన్నప్పుడు, ఇలాగే దసరాలో మీడియా పాయింట్‌లో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే పోలీసులొచ్చి మైక్ లాగేసి అక్కడి నుంచి పంపించేశారు. ఇప్పుడు మాత్రం దర్జాగా వైకాపా నేతలొచ్చి ఆలయంలో రాజమర్యాదలు అందుకుంటున్నారు.

అన్ని క్యూలైన్లు.. ఉచిత దర్శనాలే

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

మూలానక్షత్రం సందర్భంగా అన్ని క్యూలైన్లలో ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశాం. దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నాం. దర్శన ఏర్పాట్లపై ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. దీనిలో 91 శాతం మంది భక్తులు సంతృప్తి తెలిపారు. ఇందుకు అన్ని శాఖల సహకారం ఉంది. ఉత్సవాల్లో ఆఖరి రోజు తెప్పోత్సవం ఆగమ పండితుల నిర్ణయం ప్రకారం జరుగుతుంది.